క్లుప్తంగా

ఘనంగా గంగాభవాని అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటిగంగ అమ్మవారు

తాళ్లూరు: మండలంలో గంగవరం పంచాయతీ సోమవర్పాడు గ్రామ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటిగంగలో వేంచేసిన గంగాభవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వరశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ చైర్మన్ కే గురుబ్రహ్మం, ఈఓ గుంటపల్లి వాసు పర్యవేక్షించారు.

ఆటోను బైక్ ఢీకొని ఒకరికి గాయాలు



గాయాలపాలైన లక్ష్మిరెడ్డి

యర్రగొండపాలెం: చిల్ల కట్టెల లోడుతో వెళ్తున్న ఆటోను మోటర్ బైక్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానిక మార్కాపురం రోడ్డులోని ఒక పెట్రోలు బంకులో పంప్ బాయ్‌గా పనిచేస్తున్న గాయం లక్ష్మిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో ఎదురుగా ఉన్న ఆటోను ఢీకొన్నాడు. ఆటోలో ఉన్న చిల్లకట్టెలు పొడుచుకోవడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన లక్ష్మిరెడ్డి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

పైప్ లీకేజీని పట్టించుకోండి సారూ..



ఎన్‌ఏపీ పైప్‌కు ఏర్పడిన లీకేజీ

కురిచేడు: స్థానిక పశు వైద్యశాల వద్ద ఎన్ఏపీ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీ నుంచి గత నాలుగు రోజులుగా నీరు వృథాగా పోతున్నాయి. అక్కడే నిల్వ ఉన్న నీటిలో పశువులు, పందులు దిగి కలుషితం చేస్తున్నాయి. సరఫరా ఆపిన సమయంలో లీకేజీ గుండా కలుషిత నీరు మళ్లీ పైప్‌లోకి చేరుతోంది. ఆ నీరు తాగితే రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, లీకేజీకి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చదువుచెప్పే వారేరీ?

- ఉపాధ్యాయుల కొరతతో చతికిలబడిన చదువులు
- పెద్దారవీడు మండలంలో 20 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- ఏడు పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు



పెద్దారవీడు మండల విద్యాశాఖ కార్యాలయం

పెద్దారవీడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల చదువులు చతికిల పడ్డాయి. ఎంపీపీ, ప్రాథమికోన్నత, జెడ్పీహెచ్ పాఠశాలలు 56 ఉండగా 6048 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో మొత్తం 290 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం 270 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కలనూతల, మద్దలకట్ట, మండల కేంద్రం పెద్దారవీడు (డిపెప్), దేవరాజుగట్టు పంచాయతీ శివాపురం, తోకపల్లి పంచాయతీ సోమేపల్లి, కంభంపాడు, ఏనుగులదిన్నెపాడు గ్రామాల్లో (జనరల్) ఎంపీపీ పాఠశాలలో ఏకోపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సెలవులు పెట్టినా, ఎంఈఓ కార్యాలయంలో జరిగే సమావేశాలకు హాజరైన రోజులు విద్యార్థుల పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పనులకు సెలవులు పెట్టాలంటే తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఎంపీపీ, యూపీ పాఠశాలలో 10 మంది, జెడ్పీహెచ్ పాఠశాలలో 10 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని సబ్జెక్టులకు నిపుణులైన ఉపాధ్యాయులు లేరు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పాఠాలు చదవకపోతే పాఠశాలలకు పంపినా ఉపయోగంలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు అగోమ్యచరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, అప్పటి వరకు విద్యా వలంటీర్లను నియమించి చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **ఉపాధ్యాయుల కొరత ఉంది**
>
> 
>
> మండలంలో 56 పాఠశాలల్లో 290 మంది ఉపాధ్యాయులకు గానూ 270 మంది మాత్రమే పని చేస్తున్నారు. 20 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధిస్తున్నాం. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సెలవులు పెట్టిన రోజులు సీఆర్పీలను ఏర్పాటు చేస్తాం.
>
> – ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ 2, పెద్దారవీడు

ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు



పెద్దారవీడులో ప్రత్యేక అలంకారంలో అంకాళమ్మ దేవత

పెద్దారవీడు: మండల పరిధిలో గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవాని, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామ సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు మహిళలు, నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయం ఆవరణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయ కర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

వైభవంగా అయ్యప్ప స్వామి రథోత్సవం



పులి వాహనంపై అయ్యప్ప స్వామి నగరోత్సవం

- భక్తి శ్రద్ధలతో నగరోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు



కలశాలతో నగరోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పెద్దదోర్నాల: అయ్యప్ప స్వామి విళక్కి మహోత్సవంలో భాగంగా అయ్యప్ప స్వామి వారికి శనివారం రాత్రి నగరోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నగరోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వామి వారు పులివాహనంపై పట్టణ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని పసిడి, రజిత ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం పూలమాలలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై స్వామి వారి విగ్రహాన్ని ఉంచారు. పులివాహనంపై వేంచేసిన అయ్యప్ప స్వామిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు దీపారాధనతో నగరోత్సవంలో పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి, పార్టీ నాయకులు

యర్రగొండపాలెం: గుండెపోటుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ బడేసా శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందారు. కార్యకర్త మృతి వార్త తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బడేసా మృతి పార్టీలో నిబద్ధగా పనిచేశారని, ఆయన మృతదేహానికి పూలమాలవేసి సంతాపం వ్యక్తం చేశారు. బడేసా మృతికి సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, బి.బాలచెన్నయ్య, షేక్ వలీ ఉన్నారు.

పోటీ పరీక్షలకు ముందుండాలి



ప్రశ్న పత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓలు

దర్శి: పోటీ పరీక్షలకు విద్యార్థులు ముందుండాలని ఎంఈఓలు కాకర్ల రఘురాయమ్మ, బీ రమాదేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ కమిటీలు నిర్వహిస్తున్న ప్రజ్ఞావికాస పరీక్ష పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామయ్య, రమాదేవిలు ప్రశ్నాపత్రాలు విడుదల చేసి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ విద్యారంగ సమస్యల పై పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థులు విద్యారంగంలో అభివృద్ధి చెందేందుకు ప్రత్యామ్నాయ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పది కేంద్రాల్లో 9 వేల మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పరీక్షల్లోనే కాకుండా రానున్న కాలంలో ప్రశ్నించడం, హక్కులు కాపాడుకోవడంలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిలు టీ రాజశేఖర్, ఎమ్ శ్రీనివాసులు, మండల కార్యదర్శి పీ ఖాశీం, నాయకులు రంగారావు, తిరుపతిరెడ్డి, అవనీంద్ర, శ్రీనివాసరావు, ఏడుకొండలు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం



ఎస్ఐని సన్మానిస్తున్న మెకానిక్‌లు

దొనకొండ: దొనకొండలో జిల్లా స్థాయి టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ కె.విజయ్‌కుమార్, ఫౌండర్ షేక్.సుభాని పాల్గొని టూ వీలర్ మెకానిక్‌లకు ఐడీ కార్డులు, మెమెంటోలు ఇచ్చారు. అన్ని మండలాలకు చెందిన అసోసియేషన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, ఆర్గనైజర్లు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఎస్ఐని సన్మానించారు. అనంతరం స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్, సాంబశివరావు, సుభాని, షేక్.సిల్వర్, సీహెచ్ హనుమయ్య, జి.వెంకటేశ్వర్లు, సయ్యద్ తాజుద్దీన్, సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



త్రిపురాంతకంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకుల సమావేశం

త్రిపురాంతకం: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హైకోర్టు అడ్వొకేట్, వడ్డెర సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి పేర్కొన్నారు. త్రిపురాంతకం వడ్డెర సంఘ సత్రంలో వడ్డెర రాష్ట్ర సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెరలు తమ హక్కుల కోసం ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు. ప్రత్యేకంగా వడ్డెర విద్యార్థులకు సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయాలన్నారు. యంత్ర పరికరాలు, జేసీబీ, పొక్లెయినర్లు, ట్రాక్టర్లు సబ్సిడీలపై అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట సత్ర నిర్వాహకులు డీ శ్రీనివాస్, మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బత్తుల ఈశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ, వర్కింగ్ ప్రసిడెంట్ వీరాంజనేయులు, వేముల శ్రీనివాసులు, దాసు, కృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, గురవయ్య పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో ఏబీఎం చర్చి

క్రిస్మస్ పండగకు చర్చిలు ముస్తాబు

దొనకొండ: క్రిస్మస్ వేడుకలకు దొనకొండలోని ఆర్‌సీఎం, ఏబీఎం, సీఎస్ఐ, లూథరన్, బెరాకా, కల్వరి చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిలను విద్యుత్ దీపాలు, స్టార్లతో అలంకరించారు. మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఆర్‌సీఎం చర్చి

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో మిర్చి రైతులు!

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆందోళన
- కాయ నాణ్యతపై దిగులు
- పశ్చిమ ప్రకాశంలో 45,813.59 ఎకరాల్లో సాగు

మార్కాపురం:

అల్పపీడన ప్రభావంతో గత రెండురోజులుగా మార్కాపురం ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మిర్చి రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా ఆకాశమంతా మేఘావృతమైంది. అయితే శనివారం రాత్రి, ఆదివారం కురిసిన జల్లులతో మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. మిర్చి కోతల కోసం కూలీలకు అధిక కూలి చెల్లిస్తున్నారు. కాయలు ఆరబెట్టుకునేందుకు రైతులు కల్లాల్లోనే మిర్చిని ఉంచారు. ఊహించని విధంగా వరుసగా అల్పపీడనాల ప్రభావంతో ముసురు పట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షానికి తడిస్తే మిర్చి తోటకు తెగుళ్లతోపాటు కాయ రంగు మారి నాణ్యత తగ్గుతుందని, ధర ఆశించిన స్థాయిలో ఉండదని మదన పడుతున్నారు. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డు మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర 16 వేల రూపాయలు ఉంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్మడం లేదా నలుగురు, ఐదుగురు రైతులు కలిపి లారీని బాడుగకు మాట్లాడుకుని గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్తున్నారు. ఎకరాకు సుమారు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు హఠాత్తుగా కురుస్తున్న వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత రెండు రోజులుగా మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, తర్లుపాడు తదితర మండలాల్లో ఓ మోస్తరు జల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు హడావుడిగా కల్లాల్లో ఉన్న మిర్చి తడవకుండా పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.



కల్లంలో ఆరబోసిన మిర్చి



వర్షం పడుతుండటంతో మిర్చిపై పట్ట కప్పుతున్న రైతు



పశ్చిమ ప్రకాశంలో మిర్చి సాగు ఇలా

మండలం	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
మార్కాపురం	2657.52
దోర్నాల	5817.10
పెద్దారవీడు	4543.83
వై పాలెం	10409.49
త్రిపురాంతకం	5767.35
పుల్లలచెరువు	8098.75
గిద్దలూరు	893.33
రాచర్ల	1086
కొమరోలు	152.31
బేస్తవారపేట	910.59
కంభం	342.23
అర్ధవీడు	2207.97
తర్లుపాడు	1520.42
కొనకనమిట్ల	765.01
పొదిలి	641.69
మొత్తం	45,813.59

> **జాగ్రత్తలు పాటించండి**
>
> 
>
> మిరప తోటల్లో నీళ్లు నిలబడకుండా చూసుకోవాలి. తేమ ఉంటే 50 కేజీల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలి. తోటలో నీరుంటే వేరుకుళ్లు వచ్చే అవకాశం ఉంది. అలా ఉన్నట్లయితే 3 గ్రాముల కాపరాక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కాయ కోతకు 20 రోజుల ముందు పురుగు మందు వాడరాదు. పూర్తిగా పండిన కాయలు మాత్రమే కోయాలి. మబ్బులతో కూడిన వాతావరణంలో కోతలు చేపట్టవద్దు. అపరిశుభ్రమైన సంచులు, ఎరువుల సంచుల్లో కాయలను నిల్వ ఉంచవద్దు. కోసిన కాయలను కల్లాల్లో ఎండబెట్టాలి. వాతావరణ పరిస్థితులను బట్టి 2 నుంచి 3 వారాలు ఎండబెట్టాలి.
>
> – రమేష్, హార్టికల్చర్ అధికారి, మార్కాపురం

> **మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి**
>
> 
>
> పశ్చిమ ప్రకాశంలో రైతులు పండించిన మిర్చి కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రైతులు వర్షాలు పడితే కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు పట్టలను ప్రభుత్వం అందించాలి. దళారుల ప్రమేయం లేకుండా ఉండేలా ప్రభుత్వమే నేరుగా మిర్చిని కొనుగోలు చేయాలి.
>
> – బాలనాగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరిపోలేరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పోలేరమ్మ అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే స్థానిక కళాశాల రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అర్చకుడు అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com